# ధన్యుడు సుమతీ

"నిక్షేపంగా స్వగృహం వుంటే, ఆసుపత్రిలో చావటం యెందుకు! డాక్టరుగార్ని యిక్కడికే పిలుచుకురా....పళ్ళు పట పట మనిపించాడు రంగనాధం.

''చాలా బాగా శలవిచ్చారు. అట్లాగే డాక్టరుగార్ని యిక్కడికే పిలుచుకువస్తా....బయలుదేరాడు చలపతి, నడుముకు బట్ట బిగించేసి.

ఏంటండి ఆమాటలు. ఓమూల మేము హడలి చస్తుంటే.... డాక్టరుగారేమొ సుస్తేంలేదని చెప్పె. టెస్టులు చెయ్యటానికి ఆసుపత్రికి తీసుకురమ్మంటే, మీరనాలసిన మాటలు యివేనా!..." గద్గదంగా అంటూ శారదమ్మ భర్త మొహంలోకి చూసింది.

"వెధవబుర్ర ఏమాటకు యేమర్ధమో కూడా తెలీదు" మధు చలపతివంక కోరగా చూశాడు.

'అయ్యగారు యేంచెపితే అదే చెయ్యటం నా ప్రథమ కర్తవ్యం, వారి ఉప్పుతిని...' ఏదో...చెప్పబోతున్నాడు చలపతి.

'నోరుముయ్, మాటమాట్లాడితే ఉప్పుతిని ఉప్పుతిని అంటూ మొదలుపెడతావు....అమ్మా, వీడికివ్వాల్టి నుంచి, ఉప్పేపెట్టండి....' కసురుక్కున్నాడు మధు.

'చలపతి కానేపు నువ్వతలికి వెళ్ళు, పనుంటే పిలుస్తాగాని' ...రంగనాథం మంచంలో లేచి కూర్చున్నాడు

'కదిలేటట్టున్నారా...' ఆయాసపడుతూ అడిగాడు.

'ఆ కదుల్తారు, రమ్మనిరాయటం మన వంతుగాని, సాగనంపటం మనతరమా యేమిటి!....' చప్పున అందుకున్నాడు మధు.

'బాగా చెప్పావు, నేను నెత్తిన నోరుపెట్టుకుని మొత్తుకుంటూనే ఉన్నా... ఎవ్వరికీ ఉత్తరం రాయకండి అని' నామాట వింటేగా ... సాధింపు మొదలు పెట్టింది శారదమ్మ.

'అయిపోయిందిగా, అదేమాట యెప్పుడూను అనాడు సుస్తి చూసి భయమేసి, మన వాళ్ళకు తెలియకపోతే యెట్లాగు అని రాయించాను వాళ్ళను రమ్మనమని యేమి ఆహ్వానించలేదే....'

'సరిపోయింది వాళ్ళకు వంకదొరికింది కుటుంబం కుటుంబం తరలి వచ్చేశారు. వచ్చి పదిహేను రోజులయిందిగదా అందులోనూ బస్తీయేను ధరలు మండిపోతున్నాయి ఇహ వెళాదామనే ధ్యాసే లేదే....'

'నీకు తెలిదేఅమ్మ....ఆసుందరంగాడికి ఉద్యోగప్రయత్నం చేస్తున్నారు. నేను చాటుగా వాళ్ళమాటలన్ని విన్నా....'

"ఇక్కడకు వచ్చింది అందుకన్న మాట...." విడ్డూర పోయింది శారదమ్మ.

మాతమ్ముడితో చెపుతా తప్పేముంది.... మళ్లీ అవసరమొస్తే టెలిగ్రాం యిస్తానని చెపుతా...'

'ఏమిటండీ ఆమాటలు ఏదొచ్చిన మీతో యిదేతంటా. అంతా తొందర తొందర. ఒకటే తొందర. అర్థంపర్థం ఉండదు. ముందర ఉత్తరాలు కురిపించటం యెందుకు. వచ్చిన వాళ్ళను వెళ్ళమని చెప్పటం యెందుకు....

ఓహో యిదా నీభావం.... మాతమ్ముని వెళ్ళమని చెపుతానంటే మీచెల్లెల్ని కూడా వెళ్ళమని చెప్పటమేగా ఇన్‌డైరెక్టుగా యిదా నీభాధ....' రంగనాధరావు కళ్ళద్దాల్లోంచి భార్య వంక చూశాడు.

'సంబరంగానేవుంది... మీతమ్ముని మాదిరిగా చీటికిమాటికి మాచెల్లెలు మనింటికి రావడం లేదుగా.

"మనింటికి వాళ్ళువచ్చి ఆరేళ్ళయింది ఇవ్వాళ నాలుగు రోజులుండేటప్పటికి మీకు యెక్కసమయిపోయింది...' శారదమ్మ, కళ్ళు అద్దుకుంది.

"మీచెల్లెలు వాళ్లువచ్చి నాలుగురోజులయిందేం...ఇవ్వాళ్టికి సరిగ్గా పదహారు రోజులు. లెక్కచూడు తెలుస్తుంది...'

'వాళ్ళు క్రిందటివారం ప్రయాణం కడితేనే బలవంతంచేసి, మరీ ఆపాను...

'ఓహో నువ్వుచేసిన నిర్వాకమే అన్నమాట...' ఏమయినా గాని, నాకుసుస్తీవుంద నిరాశానే అనుకో మాటవరసకి....కుటుం

బంతో సహావచ్చి తిష్టవేసుకోవాలా యేమిటి.... డాక్టరు చెప్పినట్లు నాకుజబ్బు నయమయినమాట నిజమేగాని వీళ్లుయింకా యిట్లాగే నాల్గురోజులపాటు అంటిపెట్టుకుంటే నాజబ్బు తిరగపెడుతుంది. అంతవరకు ఖాయమె...." రంగనాథం ఆయాసపడుతూ ఊగిసలాడు తున్నాడు.

ఇదెక్కడ పాపం అంట....నన్నేం చెయ్యమంటావు ఇప్పుడు .... నేను చెడ్డదాన్ని అయితే అయ్యానుగాని మా చెల్లెలితో చెప్పే స్తాల్నే ఇక మీరు వెళ్ళండి అని ఏడవడం మొదలు పెట్టింది.

అయితే మా తమ్ముడితోనూ చెప్పేస్తా నేను మీ వదినకు వంట్లో బాగా వుండటం లేదు. అసలు యేమాత్రం పని చెయ్యలేక పోతోందని....!

'ఇది బాగానే వుంది వాళ్ళిద్దరూ కూడా నన్నే ఆడిపోసు కుంటారు నా కెందుకొచ్చిన గొడవ అయినా నాలుగు రోజులు ఓపిక పడితే వాళ్ళంతట వాళ్ళు వెళ్ళి పోతారేమొ చూద్దాం....

"ఆ....బాగానే....మనం మెదలకుండాఊరుకొంటే ఇన్నాళ్ళూ వున్నారు. లేకపోతే నాన్నకు కులాసా చిక్కిందని తెలియంగానే మవ్వాడు వెళ్ళి పోవద్దూ".

"నారాయణ వస్తాడని పిన్ని ఎదురుచూస్తూ కూర్చోవటం.... ఉద్యోగం వస్తుందేమోనని సుందరం ఎదురుచూస్తూ కూర్చోవటం బాగానే వుంది...." మధు మొహం బిటబిట లాడించాడు.

'అవుతే ఏం చెయ్యమంటావురా ఇప్పుడు మీ నాన్నగారు చెప్పినట్టు వాళ్ళతో నిర్మొహమాటంగా చెప్పేసెయ్యటమే అంటావా....'

అట్లాకాదే, నువ్వుచెప్పినట్టే చేదాం ఇక నాలుగు రోజులు ఓపిక పడదాం ఈలోగా వెళ్ళారా సరే. లేకపోతే ఏం చెయ్యాలో అదే చేద్దాం మధు సమాధాన పరిచాడు.

'ఇంకా నాలుగు రోజులే !....' అంటూ మంచంమీద అమాంతం వెలికిలబడ్డాడు రంగనాథం.

'నువ్వు అధైర్యపడక నాన్నా... వచ్చినవాళ్లు వెళ్ళక కూర్చుంటారుట గాని. డాక్టరుగారు చెప్పినట్లు మందులు అవి తీసుకుంటూవుండు.... సరిగ్గా నాలుగు రోజులంటే నాలుగు రోజులు, ఆ తర్వాత వాళ్ళపని నే చెపుతాగా.... మధు ధైర్యం యిచ్చాడు.

డాక్టరుగారు రాగానే, శారదమ్మ గబగబ వెళ్ళి, వారికి మంచి మందివ్వండి ... ఒకటే దిగులు పెట్టుకున్నారు అన్నది.

'మనోవ్యాధికి మందు లేదన్నారు.... మాట మాటకి ఉద్రేకపడితే యేం లాభం చెప్పండి... దానివల్ల వచ్చింది. ఆయన తమ్ముడూనూ చెల్లెలూనూ చూసి పోదామని వచ్చారు బస్తీలో ఇన్నిరోజులు ఉండటం మంచిది కాదనుకోండి. అయినా మనమేం చేస్తాం... రంగనాథంగారి బాధ నాకు అర్థమయింది. అయినా నేను ఏం చెయ్యగలను చెప్పండి ఓదార్పు మాటలు చెప్పాడు

'అయితే మీకు యీ విషయాలన్నీ చెప్పారన్న మాట.

సరేలెండి. యీ రెండు రోజులబట్టి యిస్తున్న మందును, ఉద్రేకం తగ్గటానికి.... శాంతంగా ఉండటానికీను.... డాక్టరు గారు చిరునవ్వు నవ్వారు.

'భలేవారండి.... ఆ మందులే ఇంకా నాలుగు రోజులపాటు పుచ్చుకోమనండి అప్పటికి వాతావరణం చల్లబడచ్చు....' మధు మెల్లిగా అన్నాడు.

"నువ్వా వింటూనేవున్నా వన్నమాట...."

నా సంగతి మీకు తెలీదు కాబోలు. నా విషయంకంటే యిత రుల విషయాల్లోనే నేను ఎక్కువ శ్రద్ధ తీసుకుంటూ వుంటా. దాంట్లోనే నాకు సంతోషమూ సుఖమూను హాయిగా నవ్వేశాడు మధు.

'ఎట్లా వుంది రంగనాథంగారూ' డాక్టరుగారు మెల్లిగా మంచం దగ్గరకు వచ్చి వలకరించాడు.

ఎట్లా వుందని చెప్పమంటారు; చావలేక బ్రతుకుతున్నా .... ఇల్లు గుల్లయిపోతోంది ఎవరితో మొరపెట్టుకోవాలి" అర్థంగావటం లేదు. అప్పులుచేసి ముప్పు తెచ్చుకున్నా. ఇప్పుడిప్పుడే తేరు కుంటుంటే, మళ్ళీ వచ్చిపడింది బెడద... అయినా మీకు తెలీందే ముంది... పోనీ తిండంటే, మాతోపాటే సర్దుకుంటారు. పైఖర్చుకు, డబ్బు అడగడం యివ్వకపోతే మన పరువు బజార్లో పెట్టడం యిదె క్కడి న్యూసెన్స్ అంట"... రంగనాథం వాపోతున్నాడు.

"ఏదో గడువు పెట్టార్ట నాలుగు రోజులని, కాస్త సహనం పట్టండి...." డాక్టరు సలహా ఇచ్చాడు.

ఒకటి రెండు రోజులు గడిచినా కూడా వాళ్ళెవరూ కదిలే సూచనలు కనబడటంలేదు. పైగా వచ్చేఆదివారం సినిమాప్రోగ్రాం బుధవారంనాడు నాటకానికి వెళ్ళడం యింకా యింకా సుమారు

పదిరోజుల ప్రొగ్రాం యింకా యిప్పుడే నిర్ణయించు కుంటున్నారు ఇవన్నీ చాటుగా వినేసి శారదమ్మకు చెప్పేశాడు.

"ఒరేయి అబ్బాయి, నాన్నగార్కి మాత్రం యీ మాటలు చెప్పకు. అసలే సుతిమెత్తని హృదయం ... ఇంకా ఆయాస పడ తాడు... మధుతో మెల్లిగా అన్నది.

ఒరేయ్. నాన్నగారు చెప్పినట్టే నాకు వంట్లో బాగాలేదని తలకు కట్టుకుని నేనుకూడా పడుకుంటే, శారదమ్మ కళ్ళు పెద్దవిచేసి కొడుకు వంక చూసింది.

ఉపాయ మవుతే బాగానేవుంది గాని ఈ సుస్తీ మనిషిని చూస్తూ చూస్తూ ఎట్లా వదిలిపెట్టి వెళ్ళటం అని. వెళ్ళేవాళ్ళనుకూడా ఆపడం అవుతుందేమో...." మధు ప్రశ్నార్థకంగా నిలబడ్డాడు.

"'ఆ మాట నిజమేరోయ్.... సమయానికి చెప్పావు..." శారదమ్మ ఆలోచనలో పడింది.

ఎల్లుండి ఆదివారం వరకు చూస్తానే తర్వాత ఏం చెయ్యాలో ఆలోచిద్దాం".... మధు కాస్తంత ఆశగా మాట్లాడాడు.

''టెలిగ్రాం...'' వాకిట్లో మాట వినిపించింది.

ఆదుర్దాగా, మధు, శారదమ్మ చప్పున వెళ్ళారు. మధు టెలిగ్రాం తీసుకుని చదువుతున్నాడు.

'బాబాయి టెలిగ్రాం యిచ్చాడు పిన్నిని పిల్లల్ని వెంటనే పంపించమని...'

'బాబాయి కులాసాగా వున్నాడా...' శారదమ్మ అడిగింది.

"ఆయనకు వంట్లో బాగాలేదనేగా, పిన్నిని పిల్లల్ని పంపిచ మని టెలిగ్రాం యిచ్చింది...''

"ఆ....ఏంటి!"

"ఏంలేదే గాభరాపడకు... వంట్లోబాగాలేదు అనిరాశాడు. మళ్ళీ ఉత్తరం వస్తుందిగా వివరంగా తెలుస్తుందిలే.... పిన్నిబాబాయి టెలిగ్రాం యిచ్చాడు...." అంటూ మధు చెప్పేశాడు.

ఆమెగార్కి కాళ్ళూచేతులు వణికినాయి. "నాయనా, యీ సాయంత్రం బండికే మమ్మల్ని యెక్కించు నీకు పుణ్యం వుంటుంది...." అనసూయ ఆవేశంగా అన్నది.

"ఎందుకు అంత భయపడతావు....ఏంలేదు. వంట్లోబాగాలేదు, మిమ్మల్ని రమ్మనమని టెలిగ్రాంయిచ్చాడు అంతేగా...." ఎంతో తేలికగా అనేశాడు.

ఆ సాయంత్రం వెంటనే అనసూయ పిల్లలు తమ ఊరు వెళ్ళిపోయారు.

మర్నాడు మధ్యాహ్నం ఎక్స్‌ప్రెస్ కవర్ వచ్చింది సుందరం పేర.

ఆదరాబాదరాగా, కవరు విప్పిచూసే సరికల్లా ఎప్పాయింట్‌మెంట్ ఆర్డర్. ఉద్యోగంలో తక్షణం చేరమని ఉన్నది.

సుందరం ఎగిరిగంతేశాడు. సంతోషంగా తండ్రికి తల్లికి చూపించి ఇక్కడ ఒక్కక్షణం వుండటానికి వీల్లేదు ఈమధ్యాహ్నం బస్సుకే వెళ్ళిపోతాను అంటూ కూర్చున్నాడు.

ఇంట్లో సందడి అంతా తగ్గిపోయింది "ఈ నాలుగురోజులు గడిచిం తర్వాత, ఏ మహాయిత్యం చెయ్యవలసి వస్తుందో అని హడలిచస్తున్నా....భగవంతుడే ఏదోదారి చూపించాడు...." అంటూ

రెండుచేతులు ఎత్తి వినబడని భగవంతునికి నమస్కారం చేసింది శారదమ్మ.

రంగనాథం కూడా సంతృప్తిగా నిట్టూర్చాడు, మనంతట మనం వాళ్ళతో ఏమీ అనకుండానే వెళ్ళిపోయారు ధన్యులం అనుకుంటూ.

మధు టెలిగ్రాం, ఎక్స్‌ప్రెస్ కవరు తానే పంపించానని మాత్రం చెప్పలేదు.....*